క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరంను ప్రారంభించిన జాయింట్ డైరెక్టర్ శారదమ్మ

ఖాజీపేట : సన్నపల్లెలో ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ చేతుల మీదుగా ప్రారంభం చేశారు. ఈ శిబిరం ద్వారా 320 పశువులకు వైద్య సేవలను అందించారు. అలాగే పశువులకు సీజనల్ ద్వారా వచ్చే జబ్బులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో డీడీ రమణయ్య, ఎడీఎ రాజశేఖర్, తోపాటు వైద్యధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.9.5 లక్షల ఆదాయం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు సోమేశ్వరస్వామి ఆలయ భూములు వేలం వేయగా రూ.9.5లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ కె.రామచంద్రాచార్యులు, దేవాదాయశాఖ ప్రొద్దుటూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆలయం పరిధిలోని 178 ఎకరాలకు వేలంపాట నిర్వహించగా, 56 మంది వేలంలో పాల్గొన్నారు. 35 మంది భూములను దక్కించుకున్నారు. ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ రాజారెడ్డి పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ రంగేష్ రెడ్డి, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఆంజనేయస్వామి ఆలయం వద్ద దాతలు పేదలకు గురువారం అన్నదాన చేశారు. సుజాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి తమ మాతృమూర్తి వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ఏర్పాటుచేసి సేవాకార్యక్రమాలు చేస్తున్నామని, ఏటా అన్నదానం, చీరల పంపిణీ, పేదలకు ఆర్థికసాయం అందించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జల కళావతి, పార్వతి, గోనా ప్రభాకర్‌రెడ్డి, కాచన సుభాష్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

4వ ఆరాధన మహోత్సవం

బ్రహ్మంగారిమఠం : శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 7వ తరం వంశ వారసులు 11వ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వాముల వారి చతుర్థ ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ ప్రాంగణంలో వసంత వెంకటేశ్వరస్వాముల వారి ప్రథమ కుమారుడు బ్రహ్మ శ్రీ వెంకటాద్రిస్వాముల వారు ప్రత్యేక పూజలు చేశారు.

హెల్మెట్ లేకుండా నడపొద్దు

ప్రొద్దుటూరు క్రైం : హెల్మెట్ లేకుండా బైక్ నడపడం ప్రమాదకరమని డీఎస్పీ భావన తెలిపారు. మైదుకూరు రోడ్డులోని కొత్తపల్లె సర్కిల్‌లో గురువారం సాయంత్రం వాహన దారులకు కొత్త చట్టాలు, ట్రాఫిక్ రూల్స్ గురించి ఆమె అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని, పిల్లలకు బైక్‌లు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకటసురేష్ పాల్గొన్నారు.

ఆర్డీఓకు ఆహ్వానం

బ్రహ్మంగారిమఠం : శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆధారన గురుపూజ మహోత్సవాలకు హాజరుకావాలని గురువారం బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్‌కు ఆహ్వాన పత్రం అందించినట్లు ఆలయ పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. మే 4 నుంచి 9వ తేదీ వరకు బ్రహ్మంగారి ఆరాధన గురుపూజ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారని తప్పనిసరిగా హాజరుకావాలని ఆర్డీఓను కోరినట్లు తెలిపారు.

గుండెపోటుతో మహిళ మృతి

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన పగిడాలనరసమ్మ (58) అనే మహిళ గురువారం గుండెపోటుతో మృతిచెందింది. ఆమె బంధువులు తెలిపిన వివరాల మేరకు మధ్యాహ్నం బాగానే ఆరోగ్యంగానే ఉండిందని, అనుకోకుండా గుండెపోటు వచ్చి పడిపోవడంతో వెంటనే ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందిందని తెలిపారు. మృతురాలికి గురయ్య అనే కుమారుడు ఉన్నాడు. తల్లి మృతిచెందడంతో గురయ్య కన్నీటిపర్యంతమయ్యాడు. వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

లక్ష్య సాధనకు మార్గదర్శి ధ్యానం

ప్రొద్దుటూరు : శాంతి, ఆరోగ్యం, లక్ష్య సాధనకు మార్గదర్శి ధ్యానం అని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సిద్దేశ్వర రావు తెలిపారు. మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ధ్యాన గురువులు వి.జయలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి పిరమిడ్ శక్తి, శ్వాసపద్ధతుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రజలలో ఆరోగ్యకరమైన జీవనశైలి పెంపొందించేందుకు ధ్యానం ఒక గురువుగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు రామమోహన్‌రెడ్డి, నరసింహస్వామి, సుకుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ ఎం.రజనీకాంత్‌రెడ్డి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ నసీర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిన విద్యుత్తు సరఫరా.. ఎండిన పంటలు



ఎండిన మొక్క జొన్న పంట



కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రొద్దుటూరు : పొలానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటకు బోరు నీరందక ఎండిపోయిన వైనం మండలంలోని చౌడూరు సమీపంలో జరిగింది. రైతు కల్లూరు నాగమునిరెడ్డి 5.5 ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్, అంతర పంటగా మొక్కజొన్న సాగు చేశారు. సాగుబడి కోసం పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించారు. నిత్యం పంటను కాపాడుకుంటూ వస్తున్నారు. గత శనివారం పొలానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటకు నీరందడం లేదు. దీంతో డ్రాగన్ ఫ్రూట్, మొక్కజొన్న పంటలు ఎండుతున్నాయి. వెంటనే తనకు మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పంటలను సంరక్షించాలని రైతు విద్యుత్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకూ పరిష్కరించకపోవడంతో పంట ఎండుతోంది. ప్రొద్దుటూరు మండల పరిధిలో ఉండగా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జమ్మలమడుగు మండల పరిధిలో ఉంది. ఈ విషయంపై జమ్మలమడుగు రూరల్ ఏఈ ఈశ్వర్‌ను సాక్షి వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, సాంకేతిక సమస్యల కారణంగా ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. ఇదే సమస్యను సాక్షి ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణకు ఫోన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఆయన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పంట ఎండిపోకుండా కాపాడాల్సిన అవసరం అధికారులపై ఉంది.

తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి సూచించారు. గురువారం స్థానిక చెన్నంపల్లెలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైను లీకేజీలు, మరమ్మత్తులు వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వాటిని పరిష్కరించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. అలాగే ప్రజలు నీటిని వృధా చేయకుండా అవసరమైన మేరకే వాడుకునేలా పర్యవేక్షిస్తుండటంతో పాటు వారిని చైతన్యపరచాలని కోరారు. అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అంతేకాకుండా చెత్త వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తసేకరణ వాహనాల్లోనే వేస్తూ పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, టీపీబీఓ నరసయ్య, ఏఈ మహేష్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మోడల్ స్కూల్‌లు చేయడం అభినందనీయం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని కందిమల్లాయపల్లె, పెద్దిరాజుపల్లె, రేకలకుంట గ్రామాల్లోని పాఠశాలలను మోడల్ స్కూల్‌గా మారుస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని మాజీ మండల అధ్యక్షుడు మాలేపాటి సుబ్బారావు తెలిపారు. విద్యార్థులకు మంచి విద్య అందుతుందని దీని ద్వారా ఉన్నత స్థాయికి వెళతారని ఆయన తెలిపారు.

నేడు మండల సమావేశం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ తహసీన్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ, మండలస్థాయి అధికారులు సమావేశానికి రావాలన్నారు. సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందని, గత సమావేశం నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై చర్చ ఉంటుందన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఇస్కాన్ మందిరంలో 6, 7, 8, 9వ తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు శబరీష్, రామమోహన్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ చిన్నారులలో నైతిక విలువలు, సత్‌ప్రవర్తన, మానసిక, శారీరక ఉత్తేజం పెంపొందించేందుకు గోపాల్ ఈ స్కూల్ పేరుతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీ నుంచి మే 11వ తేదీ వరకూ రోజూ ఉదయం 9.45 గంటల నుంచి 12 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు, ధ్యానం, క్రీడలు, నృత్యం తదితర వాటిలో శిక్షణ ఇస్తారని తెలిపారు. పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10వేలు, రూ.5వేలు, రూ.2500 ఇస్తామన్నారు. 10 మందికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ నెల 27వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8520027510, 6303474393 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థతో గ్రామాభివృద్ధి

చాపాడు : పంచాయతీ రాజ్ వ్యవస్థ వలననే రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మండల అధ్యక్షుడు తెలిదేల లక్ష్మయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ వ్యవస్థ వచ్చిన తర్వాతనే గ్రామాలు దినదినాభివృద్ధిగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు ఇలా అనేక రకాలుగా ప్రజలకు సమస్యలను ఇక్కడి నుంచే పరిష్కారం లభిస్తోందన్నారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి మాట్లాడుతూ.. 1992లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు చేసిన 73వ రాజ్యాంగ అధికరణ ద్వారా 1993 ఏప్రిల్ 24న పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటైందన్నారు. అనంతరం ఎంపీపీ లక్ష్మయ్య, గ్రామ సర్పంచ్ మహాబూబ్ బీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణిని శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, సోమాపురం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

బి.కోడూరు : పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన బి.కోడూరులో ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ జాన్‌కెనడీ, ఈసీ ఖాజా, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెంటు భూమి కూడా ఆక్రమించలేదు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : కాశినాయన మండలంలో స్థానిక జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారని మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఖండించారు. ఒక్క సెంటు భూమి కూడా అక్రమంగా పొందలేదని స్పష్టం చేశారు. అక్రమ పట్టా లేదా, అక్రమణ భూమి ఉన్నట్లు రుజువు చేస్తే ఆ భూమి వారికే ఇస్తామని సవాల్ విసిరారు. గురువారం పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన తమ్ముడు, కాశినాయన మండల జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డితో కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ పాలనలో ఏడెనిమిది విడతలుగా భూ పంపిణీ కార్యక్రమం జరిగిందని, తన చేతుల మీదుగా 20 వేల ఎకరాలు పేదలకు పంపిణీ చేశానన్నారు. అప్పుడు కూడా తమ బంధువులు ఎవ్వరూ భూములు తీసుకోలేదని పేర్కొన్నారు. తాము ఏనాడు భూ దందాకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ఇప్పుడు ఈ వార్తలు ఎందుకు రాశారో కూడా తెలియడం లేదన్నారు. పాత్రికేయ వృత్తిలో ఉంటూ అక్రమంగా భూములు పొందాలనుకోవడం సరికాదన్నారు. గంగనపల్లెకు చెందిన ఓ విలేకరి సత్యనారాయణరెడ్డి వద్దకు వచ్చి 15 ఎకరాలు అడగటంతో స్థానికేతరులకు భూమి రాదని స్పష్టం చేశారని, మరో విలేకరి 20 ఎకరాలు పొందినట్లు తెలుస్తున్నదని, భూ దందాలకు తప్పుడు కథనాలు రాయడం సబబా? అని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎక్కడా ప్రభుత్వ భూమి పొందలేదని, తనకు డీకేటీ భూమి ఉందని రుజువు చేస్తే అది వారికే ఇస్తానని ప్రకటించారు. ఎంపీపీగా, జెడ్పీటీసీగా ఉంటూ ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదన్నారు. తప్పుడు వార్తలతో పత్రికల స్థాయి దిగజార్చవద్దని హితవుపలికారు.

జగన్ ఇమేజ్ డామేజ్ చేసేందుకు కుట్ర

ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



చాపాడు : గత ప్రభుత్వంలో మద్యం సరఫరాలో అక్రమాలు జరిగాయంటూ నాటి సీఎం వైఎస్ జగన్ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డిని అడ్డుపెట్టుకుని కూటమి ప్రభుత్వం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇమేజ్‌ను డామేజ్ చేసేందుకు ఏసీబీ అధికారులతో కుట్రలకు తెరతీస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఈయన మాట్లాడుతూ.. అక్రమ కేసులు పెట్టేందుకు కూటమి సర్కార్ వ్యూహం అమలు పరుస్తూ విష ప్రచారం, గ్లోబెల్స్ ప్రచారం చేస్తోందని వివరించారు. జగన్ అక్రమాలు చేసినట్లు ఏపీ ప్రజల్ని నమ్మించేందుకు పత్రికలు ఇలా ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం సంవత్సరం లోపే అట్టర్ ప్లాప్ కావడంతో దానిని దారి మళ్లించేందుకు ఇలాంటి కట్టు కథలు అల్లుతున్నారన్నారు. ఎక్కువ వసూలు చేసి రూ.1255 కోట్లు దోచుకున్నారని నాడు కేసు నమోదు చేసి చంద్రబాబు, కొల్లు రవీంద్ర తదితరులపై కేసు నమోదు చేసిన విషయాన్ని రెడ్యం గుర్తు చేశారు.

సుంకులుగారిపల్లెలో పీఎండీఎస్ సాగు

మైదుకూరు : మండలంలోని సుంకులగారిపల్లెలో గురువారం ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు పీఎండీఎస్ సాగును ప్రారంభించారు. నంద్యాలంపేట క్లస్టర్ పరిధిలోని సుంకులుగారిపల్లెకు చెందిన రైతు నాగేశ్వరరెడ్డికి చెందిన రెండు ఎకరాల పొలంలో పీఎండీఎస్ సాగును చేపట్టారు. కార్యక్రమంలో శ్రీనాథ్‌రెడ్డి యూనిట్ ఇన్‌చార్జి సుబ్బరాజు, ఈసీఆర్ పి.స్వప్న కుమారి, రమణయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి దుర్మార్గమైన చర్య



కొవ్వొత్తులు వెలగించి నివాళులర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి దుర్మార్గమైన చర్య అని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ గురువారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఆర్టీసీ బస్టాండు మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు విజయకుమార్, వెంకటసుబ్బారెడ్డి, రవిశంకర్, రామచంద్రారెడ్డి, అంకయ్యలు మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఎంతో పాశవికంగా దాడికి పాల్పడి భారతీయులను కాల్చి చంపడం దారుణమని, ఈ దాడి దేశ సారభౌమాధికారంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్లింల కొవ్వొత్తుల ప్రదర్శన

పోరుమామిళ్ల : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గాంధీ బొమ్మ సర్కిల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. దాడి చేసిన వారిని ఎలాంటి పరిస్థితిలో క్షమించరాదని, తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రాజీవ్‌బాషా, కార్యదర్శి హబీబ్‌బాషా, వైస్ ఎంపీపీ సీఎం బాషా, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

మైదుకూరు : కశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని నిర్దాక్షిణ్యంగా చంపడంపై మైదుకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిలో పర్యాటకుల మృతిపై మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేసుల శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆకుల శివరాం, సంయుక్త కార్యదర్శి గోశెట్టి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉగ్రదాడిలో మరణించిన వారికి ఆత్మ శాంతి కలగాలని విశ్వ హిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో గురువారం కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయకులను కాల్చి చంపడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జునరావు, మార్లెళ్ల మల్లికార్జునరావు, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, నరేంద్రరావు, జింకా మార్కెండేయ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : పహల్గామ్ ఉగ్రవాదుల దాడి ద్వేష పూరిత చర్య అని ప్రొద్దుటూరు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ త్యాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయిప్రసాద్, కోశాధికారి డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం చాలా హేయమైన చర్య అన్నారు. మానవతా వాదులందరూ ఈ చర్యను ఖండించాలని అన్నారు.

ఖాజీపేట : అమాకులైన పర్యటక ప్రజలపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హతమార్చడం అత్యంత తీవ్రమైన చర్యగా భావించి ఖాజీపేట మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఖాజీపేట బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. డీఎల్ శ్రీనివాసులరెడ్డి, నాగిరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్తులో కార్యకర్తలకే పెద్దపీట వేస్తాం

- ప్రతి నెలా నియోజకవర్గ నేతలతో కలుస్తా
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఉగ్రదాడిలో మృతులకు సంతాపం తెలుపుతున్న మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: నాయకులే కాదు కార్యకర్త ఇంటి వరకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వచ్చే రోజు తప్పక వస్తుందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, గోపవరం గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లతోపాటు మొత్తం 114 మంది నాయకులు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జగన్‌ను కలిశారు. నాలుగు గంటలపాటు విడివిడిగా అందరితో జగన్ మాట్లాడడంతోపాటు ఫొటోలు తీసుకున్నారు. జగన్ ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు నిల్చొనే అందరితో మాట్లాడటం నాయకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అనంతరం రాచమల్లు శివప్రసాదరెడ్డి సాక్షితో మాట్లాడుతూ ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ప్రలోభాలకు లొంగకుండా అధికార పార్టీ వైపు వెళ్లకుండా ధైర్యంగా వైఎస్సార్‌సీపీలో ఉన్న 22 మంది మున్సిపల్ కౌన్సిలర్లు, గోపవరం గ్రామ పంచాయతీకి సంబంధించిన 14 మంది వార్డు మెంబర్లను కలిపేందుకు జగన్ దగ్గరికి వెళ్లామన్నారు. నిజాయితీగా వైఎస్సార్‌సీపీ జెండా వైపు ఉన్నందుకు మాజీ ముఖ్యమంత్రి వారిని అభినందించారని, ఇతరులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారన్నారు. పరిస్థితులను బట్టి కార్యకర్తల ఇళ్ల వద్దకు వచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వెనకాడరన్నారు. కార్యకర్తల విషయంలో గతంలో జరిగిన పొరపాట్లను పార్టీ సరిదిద్దుకుందని, భవిష్యత్తులో కార్యకర్తలకే పెద్దపీట వేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన నేతలతో జగన్ కలుస్తున్నారన్నారు. అందులో భాగంగా గురువారం నియోజకవర్గానికి చెందిన 114 మందితో విడివిడిగా మాట్లాడారన్నారు. ఈ అంశం కార్యకర్తలు, నాయకులలో ఎంతో సంతోషాన్ని నింపిందన్నారు. వాస్తవానికి పార్టీ క్యాడర్ కోరుకున్నది, ఆశించింది ఇదేనని తెలిపారు. కార్యకర్తలకు జగన్‌కు మధ్య వారధిగా పనిచేసిన తాను ఎంతో సంతోషపడుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపం

పహల్గామ్ ఉగ్రదాడిలో చనిపోయిన భారతీయులకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డితో పాటు ప్రొద్దుటూరు నియోజకవర్గ నేతలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి కృషిచేయాలి

ప్రొద్దుటూరు : చేనేతల సంక్షేమానికి కృషి చేయాలని బీజేపీ చేనేత విభాగం జిల్లా కన్వీనర్ శిలివేరు వెంకటేశ్వర్లు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్రరావు, ప్రధాన కార్యదర్శి చెన్నామోహన్ కోరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి గురువారం వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో సింగిల్ ఫేస్ కలిగిన పవర్‌లూమ్ మగ్గాలు 4వేల నుంచి 5వేల వరకు ఉన్నాయన్నారు. చేనేత మగ్గాలు నేసే కార్మికుల కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, పవర్ లూమ్ మగ్గాల కుటుంబాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందేలా చూడాలని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన జీఓను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. చేనేత, జౌళిశాఖ వారి ఆధ్వర్యంలో జిల్లాలో పవర్ లూమ్ నేత కార్మికుల వివరాలను సేకరించి ఈ పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత వృత్తి చేసుకునే కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ విధానం పవర్ లూమ్ కార్మికులను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు.



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు